ఫిబ్రవరి 16న కార్మికుల సమ్మె: సీఐటీయు



మున్సిపల్ కమిషనర్ సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయు నాయకులు

మణికొండ: మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఫిబ్రవరి 16వ తేదీన పెద్ద ఎత్తున సమ్మెకు దిగుతున్నామని సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి ఎ. దేవేందర్ అన్నారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో కార్మికులు మణికొండ మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్‌కు సమ్మె నోటీసును అందించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ గత ప్రభుత్వానికి అనేక సార్లు మొరపెట్టుకున్నా కార్మికుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. వారికి కనీస వేతనం రూ. 26వేలు, 10లక్షల ఇన్సూరెన్స్, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 5 గ్యారంటీలను కార్మికులకు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా పలు కార్మిక సంఘాలు సంయుక్తంగా సమ్మెను నిర్వహిస్తున్నాయన్నారు. కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెని జయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, మణికొండ మున్సిపల్ కార్మికులు చంద్రశేఖర్, విజయ్, వరలక్ష్మి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన డేటా ఎంట్రీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని 5 డివిజన్ల నుంచి వచ్చిన 6 హామీల దరఖాస్తు పత్రాల డేటా ఎంట్రీ పూర్తయింది. రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్ల నుంచి 6 హామీల కోసం దాదాపు 94 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులన్నింటిని ఈ నెల 7వ తేదీ నుంచి రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంతో పాటు వార్డు కార్యాలయాల్లో ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి డేటా ఎంట్రీని ప్రారంభించారు. దాదాపు 10 రోజుల్లో 94 వేల దరఖాస్తులను సిబ్బంది కంప్యూటర్‌లో నిక్షిప్తం చేశారు. 250 మందికి పైగా ఉద్యోగులు ఈ డేటా ఎంట్రీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరందరిని ఉప కమిషనర్ రవి కుమార్ బుధవారం అభినందించారు. మొత్తం సర్కిల్‌లో లక్షకు పైగా దరఖాస్తులు అందాయి. ఆరు హామీల కోసం 94 వేల దరఖాస్తులు అందడంతో వాటిని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. రేషన్ కార్డుతో పాటు ఇతర పథకాల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వాటిని సైతం అధికారులు పూర్తిస్థాయిలో క్రమబద్ధీకరించి పథకాలకు అనుగుణంగా నిక్షిప్తం చేశారు.

ఆస్తిపన్నుపై డీసీ సమావేశం



ఏఎంసీ, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లతో సమావేశమైన డీసీ రవి కుమార్

రాజేంద్రనగర్: ఆస్తిపన్ను మొండి బకాయిల వసూలు కోసం రెడ్ నోటీసులను జారీ చేయాలని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్ అధికారులకు సూచించారు. ఏఎంసీ, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లతో బుధవారం ఆయన తన కార్యాలయంలో సమావేశం అయ్యారు. మొండి బకాయిల లిస్టును తయారు చేయాలన్నారు. ఇప్పటికే నోటీసులు ఇచ్చినా స్పందించని వారిని గుర్తించి రెడ్ నోటీసులు జారీ చేయాలన్నారు. అయినా స్పందించకపోతే ఆస్తులను జప్తు చేయాలన్నారు. రోజువారీ ఆస్తిపన్ను వసూళ్లను మరింత పెంచాలని అధికారులకు ఆదేశించారు. అధికారులు, సిబ్బంది ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచే ఆస్తిపన్ను వసూలు కోసం తరలివెళ్లాలన్నారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించవద్దన్నారు.

అయ్యప్ప స్వాముల శబరిమల యాత్ర



అయ్యప్ప మాలధారులకు వీడ్కోలు పలికిన బీజేపీ నాయకులు

మణికొండ: మండల కాలం పాటు అయ్యప్ప మాలదారణ చేసి నిష్టగా పూజలు చేసిన స్వాములు శబరిమలలోని అయ్యప్పస్వామి దర్శనానికి బయలుదేరారు. మణికొండ పార్వతీరామలింగేశ్వరస్వామి దేవాలయ సన్నిదాన స్వాములు బుధవారం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వాములంతా ఇరుముడులు కట్టుకుని శబరికి బయలుదేరారు. ఈ సందర్భంగా వారికి బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సి. బీరప్ప ఆధ్వర్యంలో సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో స్వాములు ఎం. రాఘవరెడ్డి, కె. ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పి. రవి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు తేదీ పెంపు

రాయదుర్గం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతిభ కళాశాల(సీఓఈ)ల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరడానికి దరఖాస్తుల స్వీకరణ గడువు తేదీని ఈనెల 20వ తేదీ వరకు పొడగించడమైనదని గౌలిదొడ్డి గురుకుల బాలుర ఐఐటీ నీట్ అకాడమీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ గణేష్ తెలిపారు. జనవరి 15వ తేదీ వరకు ఉన్న గడువును 20వ తేదీ వరకు పొడిగించడమైందని తెలిపారు. ఫిబ్రవరి 4వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు.

అభివృద్ధిలో పరిశోధనలు కీలకం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్

రాయదుర్గం: ఏ సంస్థలోనైనా అకడమిక్ ఎదుగుదలలో పరిశోధనలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని 'మనూ' స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ పేర్కొన్నారు. మనూలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (సీఎస్ అండ్ ఐటీ) విభాగం ఆధ్వర్యంలో 'కంప్యూటర్ సైన్స్‌లో ఎమర్జింగ్ రీసెర్చ్ ట్రెండ్స్' అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, వాటిని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. సమకాలీన కంప్యూటర్ సైన్స్ పరిశోధనను రూపొందించే తాజా పురోగతులు, పద్ధతులు, ఇంటర్ డిసిప్లినరీల సహకారంపై మరింత అవగాహన అధ్యాపకులకు అవసరమన్నారు. సీఎస్ అండ్ ఐటీ విభాగం అధిపతి ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ పరిశోధనా కార్యకలాపాల గురించి వివరించారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్ ఇంతియాజ్‌హసన్, అసిస్టెంట్ ప్రొఫెసర్, కోఆర్డినేటర్ మోహతేషామ్‌షాఖాద్రీ, కన్వీనర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖలీదా అఫ్రోజ్ పాల్గొన్నారు.

పంచాయతీ భవనం పూర్తయ్యేది ఎన్నడో?

- గుంతలకే పరిమితం
- అర్ధంతరంగ నిలిచిన పనులు
- సొంత భవనం లేక ఇబ్బందులు



పంచాయతీ భవనం నిర్మాణం కోసం తీసిన గుంతలు



మండలంలోని రషీద్‌గూడ పంచాయతీ భవనం నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం

శంషాబాద్ రూరల్: కొత్త పంచాయతీగా ఏర్పడి 5 సంవత్సరాలు కావస్తున్నా.. కార్యాలయానికి సొంత భవనం సమకూరలేదు. నిధులు మంజూరై పనులకు శంకుస్థాపన చేసి 5 నెలలు గడిచినా.. పనుల్లో పురోగతి లేదు. ఇరుకు గదుల్లోనే కార్యకలాపాలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని రషీద్‌గూడ పంచాయతీకి సొంత భవనం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 5 సంవత్సరాల క్రితం కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయడంతో అప్పటి నుంచి స్థానికంగా ఉన్న డ్వాక్రా మహిళా భవనంలోనే సభలు, సమావేశాలు, ఏర్పాటు చేసుకుంటున్నారు. అదే విధంగా ఈ పంచాయతీకి పోశెట్టిగూడ గ్రామం అనుబంధంగా ఉంది.

నిధులు మంజూరైనా..

పంచాయతీ భవనం కోసం ఉపాధి హామీ పథకంలో రూ.20 లక్షలు మంజూరయ్యాయి. రషీద్‌గూడ చౌరస్తా వద్ద భవనం కోసం స్థలం కేటాయించారు. గత ఏడాది జూలైలో పనులకు శంకుస్థాపన చేశారు. అయితే కాంట్రాక్టరు భవనం నిర్మాణం కోసం గుంతలు తీసి వదిలేశారు. పనులు అప్పటి నుంచి ముందుకు కదలడంలేదు. పిల్లర్ల కోసం తీసిన గుంతలు పూడుకుపోతున్నాయి. త్వరగా పనులు చేపట్టి భవనం నిర్మాణం పూర్తి చేస్తే బాగుంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

పనులకు వెనకడుగు..

రషీద్‌గూడ, పోశెట్టిగూడ గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లు, భూగర్భ మురుకు కాలువ నిర్మాణం కోసం ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ రూ.20 లక్షల నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు. ఈ మేరకు 3 నెలల కిందటనే పనులు చేపట్టాల్సి ఉండగా.. ఎన్నికల రాకతో పనులు మొదలు పెట్టలేదు. రాష్ట్రంలో అధికార పార్టీ మారడంతో పనులు చేసేందుకు అడ్డంకులు ఎదురవుతున్నాయని సర్పంచు రాణి పేర్కొంటున్నారు.

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు..



ఎమ్మెల్యే చొరవతో మంజూరైన నిధులతో పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. పనులు పూర్తి చేసిన తర్వాత బిల్లులు వస్తాయో రావో తెలియదని అధికారులు చెబుతున్నారు. పంచాయతీ భవన నిర్మాణం పనులు కూడా ఆగిపోయాయి. మరి కొన్ని రోజుల్లో మా పదవి కాలం ముగిసిపోతుంది.

–ఎం. రాణిరవి, సర్పంచు, రషీద్‌గూడ

కబ్జాలకు పాల్పడుతున్న నేతలపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న పీసీసీ ఎస్సీసెల్ నేతలు నరేందర్, సంజయ్‌యాదవ్

శంషాబాద్: భూ కబ్జాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ నేతలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్‌లు డిమాండ్ చేశారు. ఇటీవల లక్ష్మీ అనే మహిళలకు సంబంధించిన (పట్టణం)లోని సర్వే నంబరు 542లో 10 గుంటల భూమిలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్ అక్రమంగా ప్రవేశించి ఇంటి నంబర్లు, నల్లా, కరెంట్ బిల్లులను తన పేరు మీదకు మార్చుకొని కబ్జా చేయడానికి యత్నించిన తీరుపై ఆర్‌జీఐఏ పీఎస్‌లో 3 రోజుల కిందట కేసు కూడా నమోదైందన్నారు. ఈ విషయమై బాధితులు ఎమ్మెల్యేను ఆశ్రయించిన పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ నేతలను ఆశ్రయించడంతో సైబరాబాద్ సీపీ మహంతి ఆదేశాలతో పోలీసులు వైస్ చైర్మన్‌పై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. గత పదేళ్లలో సుల్తాన్‌పల్లి, ఎయిర్‌పోర్టు కాలనీ, సింప్లెక్స్‌లో జరిగిన కబ్జా భాగోతాల్లో ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరుల పాత్ర ఉందనేది నగ్నసత్యమని ఆరోపించారు. ఇప్పటి వరకు చేసిన కబ్జాలన్నింటిని వెలికితీసి వారి భాగోతం బయట పెట్టడం ఖాయమన్నారు. కబ్జాల్లో ఉన్న అందరినిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీనియర్ మహిళా నాయకురాలు మైలారం సులోచన, ఆర్.ఎస్ అంజయ్య, జహంగీర్ పాషా, అక్రమ్‌ఖాన్, ఘనీ, ఉమామహేష్, పెద్దగండు శ్రీధర్, రుక్మారాజ్, సాధక్, నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సొడమ్మ జాతర

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని సొడమ్మ దేవాలయంలో సంక్రాంతి జాతర బుధవారం ముగిసింది. ప్రతి సంవత్సరం సంక్రాంతి నుంచి మూడు రోజుల పాటు ఈ దేవాలయం వద్ద జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. సంక్రాంతి పండుగ రోజున తెల్లవారు జాము నుంచి ప్రారంభమైన జాతర బుధవారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా దేవాలయంలో నిర్వహించిన పూజ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఉదయం అమ్మవారికి ఒడి బియ్యం పోయడంతో పాటు బోనాన్ని నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవాలయం కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేపట్టామన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ఉజ్వల భవిష్యత్తు

గోల్కొండ: ఆధ్యాత్మిక విషయాలపై పిల్లలకు చిన్నతనం నుంచే అవగాహన కల్పిస్తుండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఉదయం ఆయన టోలిచౌకీ మెజిస్టిక్ గార్డెన్‌లో అహ్లే సున్నత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 40 రోజుల పాటు నమాజ్ ఆచరించిన పిల్లలకు సైకిళ్లను అందించారు. పిల్లలకు దైవభక్తి పట్ల అవగాహన కల్పించడానికి పిల్లలను ఉత్సాహపరచడం ఒక గొప్ప విషయమని ఈ విషయంలో అహ్లే సున్నత్ వెల్ఫేర్ సొసైటీ బాగా పనిచేస్తున్నారన్నారు. 40 రోజుల పాటు పిల్లలు రోజూ 5 పూటల నమాజ్ ఆచరించడం వల్ల పిల్లల జీవితాల్లో నూతన ఉత్తేజం వస్తుందని అభిప్రాయపడ్డారు. అహ్లే సున్నత్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులతో పాటు నానల్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

జడ్‌సీని కలిసిన ఎమ్మెల్యే, కార్పొరేటర్లు



స్నేహ శబరీష్‌ను సన్మానించిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

గచ్చిబౌలి: జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌ను బుధవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు, నాయకులు కలిశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆమెను కలిసి శాలువాతో సత్కరించి పూలమొక్కను అందించారు. అనంతరం జంట సర్కిళ్ళ పరిధిలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి, పెండింగ్ పనులపై చర్చించారు. గతంలో అభివృద్ధి పనులకు డివిజన్ల వారీగా రూ.8 కోట్లు మంజూరయ్యేవని, కానీ ప్రస్తుతం రూ.4 కోట్లు మాత్రమే మంజూరు అవుతున్నాయని ఎమ్మెల్యే ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఆ నిధులు సకాలంలో రావడంలేదన్నారు. రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, హమీద్‌పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజులారఘునాథ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. హైదర్షా కోట్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కాలిమందిర్ ఫీడర్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు, గ్రీన్‌వాక్ ఫీడర్‌లోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, ప్రెస్టిజ్ ఫీడర్‌లోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు, సాతంరాయి ఫీడర్‌లోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, త్రిశూల్ మెటల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు, సంధిగూడ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, చిన్న గోల్కొండ ఏజీఎల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు, కుటీరాం ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతలల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, పార్కింగ్ ఏరియా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

- **రాజేంద్రనగర్:** విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నందిముస్లాయిగూడ ఓహెచ్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, శాలీమార్ ఫీడర్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్ల మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, జనప్రియ ఓహెచ్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.
- **బండ్లగూడ:** హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఏఈ పి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కాళీమందిర్, సన్‌సిటీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యానగర్, శివపురి, శివసాయినగర్, సంజయ్‌గాంధీనగర్, గంధంగూడ, ఇండస్ వ్యాలీ, లిబ్బమ్ విల్లాస్, సంఘం సిటీ, బైరాగిగూడ, సన్‌సిటీ, వెస్టెండ్ కాలనీ, హిమగిరి నగర్ తదితర ప్రాంతాలలో కోత ఉంటుందన్నారు. హైదర్షాకోట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశాంత్‌నగర్, బృందావన్ కాలనీ, నర్సారెడ్డి కాలనీ, పద్మశ్రీహిల్స్, తిరుమల గార్డెన్, పవనీహార్మనీ వ్యాలీస్ తదితర ప్రాంతాలలో విద్యుత్ కోతలు ఉంటాయన్నారు. వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

నూతన తరగతి గదుల నిర్మాణం



భూమి పూజ చేస్తున్న దృశ్యం

శంషాబాద్ రూరల్: మండలంలోని కవ్వగూడ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నూతన తరగతి గదుల నిర్మాణం కోసం బుధవారం శంకుస్థాపన చేశారు. రౌండ్ టేబుల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టారు. విద్యాభివృద్ధి కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ ఆదర్శ్, సర్పంచు రమేష్, ఎంపీటీసీ సంగీతసిద్ధేశ్వర్, ఉపసర్పంచు పద్మా, వార్డు సభ్యులు చందు, నరేష్, దేవేందర్, రమేష్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్యారల్ కంపెనీలో అగ్నిప్రమాదం



మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ పారిశ్రామిక వాడలోని ఓ కంపెనీలో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ క్రిష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం..కాటేదాన్ పారిశ్రామిక వాడలోని ఏషియన్ బ్యారల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో మంగళవారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలంటుకున్నాయి. పెయింట్ డబ్బాలకు అంటుకోవడం వల్ల భారీగా మంటలు ఎగసి పడ్డాయి. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలికి చేరుకున్న సిబ్బంది రెండు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కంపెనీలో కొన్ని మిషన్‌లు కాలి బుడదయ్యాయి. ఎలాంటి ప్రాణ నష్టం కలుగలేదని కొంత ఆస్తి నష్టం అయ్యిందని ఎస్ఐ తెలిపారు.

'ఎస్కీ' ఇక ఎవర్‌గ్రీన్

'లోకల్'కు ప్రాధాన్యం.. ఉపాధి ఆధారిత కోర్సులపై ప్రత్యేక దృష్టి



ఎస్కీ ప్రధాన భవనం

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ)లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇకపై 'ఎస్కీ'లో స్థానికతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ మేరకు ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు నాయకత్వంలో చర్యలు చేపట్టారు. 1981లో గచ్చిబౌలిలో 70 ఎకరాల్లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) ద్వారా ఏర్పాటు చేయబడిన స్వయం ప్రతిపత్తి సంస్థగా గుర్తింపు పొందింది. ముఖ్యంగా ఇంజనీర్లు, మేనేజర్లకు నిరంతరం శిక్షణను అందించడంతోపాటు ప్రభుత్వ ఏజెన్సీలు, పరిశ్రమలకు కన్సల్టెన్సీ సేవలను కూడా అందిస్తుంది. ఎస్కీ అనేక ప్రముఖ ఇంజనీర్లు, నిర్వాహకులు, విద్యావేత్తలతో అధికారిక సంబంధాలను కలిగి ఉంది. వారు అనుబంధ అధ్యాపకులు, కన్సల్టెంట్‌లుగా కూడా పనిచేస్తున్నారు. అంతేకాకుండా పలు రకాల కోర్సులను కూడా నిర్వహిస్తూ ఐఎస్‌బీ తరహాలో ఉన్నత విద్యా రంగంలో తనకంటూ ప్రత్యేకతను చాటుతోంది.

ఇక స్థానికులకు అత్యంత ప్రాధాన్యత..

- 'ఎస్కీ'లో ఉన్నత విద్యాభివృద్ధి కోసం బిజినెస్ స్కూల్‌ను ఏర్పాటు చేసి దానికి 'స్కూల్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ స్టడీస్'గా నామకరణం చేశారు.
- ఏఐసీటీఈ అనుమతితో ప్రస్తుతానికి పీజీ డిప్లొమో రెండేళ్ళ కోర్సులను నిర్వహిస్తోంది. భవిష్యత్తులో మరిన్ని కోర్సులను నిర్వహించేందుకు ప్రతిపాదనలు చేశారు. ఈ కోర్సులలో చేరే వారిలో ఈ ఏడాది నుంచి స్థానికులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.
- ప్రతి యేటా రెండేళ్ల ఫుల్‌టైమ్ పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, పీజీడీఎం ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ వంటి కోర్సులను నిర్వహిస్తోంది.

'ఎస్కీ టెక్నో హబ్' ఏర్పాటుకు చర్యలు

- గచ్చిబౌలిలోని ఐఎస్‌బీలో డీ ల్యాబ్స్, ట్రిపుల్‌ఐటీలోని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ (సీఐఈ), హెచ్‌సీయూలోని ఎస్పైర్ బయోనెస్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లను స్ఫూర్తిగా తీసుకొని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో కూడా త్వరలోనే 'ఎస్కీ టెక్నోహబ్'ను ఏర్పాటు చేయాలని సంకల్పించారు.
- ఇక్కడ చదివే విద్యార్థులకు స్టార్టప్ కల్చర్‌పై మరింతగా అవగాహన పెంచేలా నూతన ఆవిష్కరణలు రూపొందేలా చేయడానికి చర్యలు చేపడుతారు.
- ముఖ్యంగా ఈ హబ్ ద్వారా ఇంక్యుబేషన్ సెంటర్‌తోపాటు కో వర్కింగ్ స్పేస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తగిన ప్రణాళికతో దీనికి రూపకల్పన చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

మార్చిలో కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం

- నగర శివారులో అత్యాధునిక సౌకర్యాలతో కన్వెన్షన్ సెంటర్‌ను మార్చిలో ఎస్కీ ప్రాంగణంలో అందుబాటులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.
- ఒకేసారి 800 మందికి శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే 100,150 మందికి వేర్వేరుగా, మరో 50 మందికి ఒకేసారి నాలుగు చోట్ల శిక్షణ, ఇతర కార్యక్రమాలు నిర్వహించేలా నాలుగు ప్రత్యేక సెమినార్ హాళ్ళను నిర్మించారు.
- ఇదిలావుండగా ప్రస్తుతానికి 100 గదుల్లో 200 మంది శిక్షణ కోసం వచ్చే వారు వసతి పొందేలా ఏర్పాట్లు ఉండగా దీన్ని మరింత రెట్టింపు చేయాలనే ప్రతిపాదనలు చేశారు.



'ఎస్కీ'లో సమావేశాల కోసం నిర్మించిన చాణక్య భవనం



'ఎస్కీ'లోని స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ భవనం

యూనివర్సిటీ హోదా వచ్చేలా..



కొత్తగా ఎస్కీ టెక్నో హబ్ ఏర్పాటు చేస్తున్నాం. దీని ద్వారా ప్రత్యేక ఇంక్యుబేషన్ సెంటర్, కో వర్కింగ్ స్పేస్‌ను అందుబాటులోకి తేవాలని నిర్ణయించాం. 2024లో యూనివర్సిటీ హోదా వచ్చేలా చొరవ తీసుకుంటాం. ఎస్కీ రూపురేఖలే మారుతాయి. స్కూల్ ఆఫ్ పోస్టుగాడ్యుయేషన్ సెంటర్‌లో చేరేవారిలో లోకల్ విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వాలని సంకల్పించాం. జాతీయ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో అనేక కార్యక్రమాలను ఈ ఏడాది నిర్వహించేందుకు తగిన చర్యలు చేపడుతున్నాం.

– డా.రామేశ్వరరావు, ఎస్కీ డైరెక్టర్

ఉచిత మెగా హెల్త్ క్యాంప్

గోల్కొండ: ఈనెల 28,29వ తేదీల్లో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నామని సహాయత ట్రస్ట్ ప్రతినిధి హాఫీజ్ ఇర్ఫాన్ నజీబ్ తెలిపారు. ఇండో యూఎస్ ఆసుపత్రి సహకారంతో 13వ ఇండియా హెల్త్ ఇనిషియేటివ్‌లో భాగంగా గోల్కొండ నయాఖీలాలోని ఉర్వా హైస్కూల్‌లో ఈ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు రెండ్రోజుల పాటు జరిగే ఈ వైద్య శిబిరంలో తమ సేవలు అందిస్తారని, వైద్య పరీక్షలతో పాటు రోగ నిర్ధారణ పరీక్షలు, అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా అందిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందని ప్రకటించారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

గోల్కొండ: ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యాన్ని వదిలి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. బుధవారం ఆయన కార్వాన్ బంజావాడిలో మాట్లాడుతూ.. పదేళ్లుగా గత ప్రభుత్వ హయాంలో అధికారులు అత్యంత నిర్లక్ష్యంగా విధులు నిర్వహించారని ఆరోపించారు. ఈసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, అధికారులు ప్రజాసేవకే ఉన్నారన్న విషయం అధికారులు తెలుసుకోవాలన్నారు. అధికారులు నిర్ధారిత సమయంలో తమ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన కోరారు. అధికారులు క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజల మన్ననలను పొందాలన్నారు.